# నా సాహిత్య వ్యాసాలు



డా॥ వెలిచాల కొండలరావు

# నా సాహిత్య వ్యాసాలు

డా॥ వెల్చాల కొండలరావు

Vyasalu (Sahityam)

*By*

**Dr. KONDAL RAO VELCHALA**

*Published by*
**Vishwanatha Shitya Peetam's**
**SISTER NIVEDITA FOUNDATION PUBLICATIONS**
11-4-654/3, Near Niloufer Hospital, Red Hills, Hyderabad - 500 004.
Phone: 23396358; 9848195959, e-mail : vkrao@sncps.com

First Edition 2013

**© Dr. V. Kondal Rao**

Rs. 125/-

*Copies can be had from*
All Leading Booksellers in India and from the Foundation

Printed at :

# విలక్షణ 'అంతర్వీక్షణం'

త్రిభాషా కోవిదులైన వెలిచాల కొండలరావు గారి కలం నుంచి తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషా కవితలే కాక, పలు అనుసృజన కావ్యాలు కూడా వెలువడ్డాయి. సృజనాత్మక సాహిత్యంతో పాటు, వివేచనాత్మక వచన రచనలో కూడా ఆయన 'తనదైన' ప్రత్యేకతను ప్రదర్శించారు. ఆయా సందర్భాలలో వెలువడిన వ్యాసాలు, సంపాదకీయాలే అందుకు నిదర్శనాలు. విషయాన్ని 'లోచూపు'తో అధ్యయనం చేసి, అన్ని కోణాలనుంచి విశ్లేషించి విశదీకరించటంలో ఆయన విలక్షణ దృక్పథం ద్యోతకమవుతుంది. దేని గురించైనా ఒకరు చెప్పినది చెప్పకుండా – కొత్తగా ఆలోచించి – తన భావాలను పాఠకులకు అందించాలన్న స్పృహ, తపన ఆయన రచనల్లో అడుగడుగునా తొంగి చూస్తుంది. భాష గురించి కాని, సాహిత్యం గురించి కాని, రచయితలు – వారి రచనల గురించికాని ఆయన అభిప్రాయాలు నవం నవంగా ఉండి పాఠకులను ఆలోచింపజేస్తూ – వారిలో జిజ్ఞాసను రేకెత్తిస్తాయి. దీన్ని నిరూపించటానికి ఎన్ని ఉదాహరణలైనా చూపవచ్చు.

'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ అన్నా, 'యుగకవి' గుంటూరు శేషేంద్రశర్మ అన్నా కొండలరావుగారికి కొండంత అభిమానం. అయితే ఆ అభిమాన ప్రవాహంలో కొట్టుకుపోకుండా – వారి రచనల్లోని గొప్ప భావాలను, సాహితీ విలువలను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా ఎత్తి చూపుతారు. అంతర్వీక్షణంతో వారి అంతరంగాలను ఆవిష్కరింపజేస్తారు. "శేషేంద్ర అన్ని కళలను, కళావాదాలను జీర్ణించుకొని సమన్వయించుకొని వ్రాసిన సమగ్ర కవి. ప్రకృతి, మానవుడు రెండే రెండు అతనికి కవితావస్తువులు. ఏది వ్రాసినా దానిలో ఈ రెండింటినీ ప్రస్ఫుటంగా ప్రతిబింబించే వాడు – వివిధ కోణాలుగా, వివిధ అనుభవాలుగా, వివిధ అనుభూతులుగా." (శేషేంద్ర స్మృతిలో...) అన్న పంక్తులు ఆ మహాకవి వ్యక్తిత్వానికి అద్దం పడతాయి.

"నా పేరు సముద్రం" అని పేర్కొన్న శేషేంద్ర సముద్రం, తుఫాను, ఝంఝూ మారుతం అను పదాలను తన కావ్యాల్లో పదే పదే వాడుతాడు. ఈ అంశాన్ని వ్యాఖ్యానిస్తూ కొండలరావుగారు "శేషేంద్ర నిజంగానే ఒక సముద్రం, కవితా తుఫాను, కవితా ఝంఝూమారుతం. దానికి ఏ అనుమానమూ లేదు. అతడు రాసినవి... సముద్రమంతటి అర్థం, సార్థం, అలంకారం కలవి" అని సముచితంగా ఉగ్గడించారు (సముద్రం నా పేరు).

శేషేంద్ర రచనాశైలిని విశ్లేషిస్తూ "ఎన్నో పాత పదాలు క్రొత్తగా వాడతాడు, కొత్త పదాలను, పదబంధాలను సృష్టిస్తాడు. వాటి ద్వారా కొత్త దృష్టి దృక్పథాలను, ఉపమానాలను, ఉత్ప్రేక్షలను, సిమిలీలను, ఇమేజరీలను అందించడానికి – తద్వారా తననుకొన్న ప్రభావాలను, ఉద్రేకాలను, ఆవేశాలను, ఆవేదనలను కలిగించుటకు ప్రయత్నించి కృతకృత్యుడవుతాడు" అని ఎంతో సమంజసమైన అభిప్రాయాన్ని వెల్లడిస్తారు. "రైతు నాగలి మోస్తున్నాడు క్రీస్తు శిలువ మోస్తున్నట్లు" అని శేషేంద్ర ప్రయోగించిన పెక్కు పంక్తులను ఉదాహరణలుగా ఉటంకిస్తూ. ఆయన ప్రధానంగా అలంకార కవి అని సహేతుకంగా నిరూపిస్తారు.

"తరచిచూస్తే శేషేంద్ర రాసిన కవితంతా విషయం కొరకు, వస్తువు కొరకు, 'నీతి'

కొరకు కాదు, ప్రధానంగా 'రీతి' కొరకు రాశాడేమో ననిపిస్తుంది... ఆయన ఉద్దేశంలో ఒక కవిత కవిత కావాలంటే దానికి కావలసింది మొదట 'సాహిత్య చైతన్యమే' కాని 'సామాజిక చైతన్యం' కాదు. సామాజిక చైతన్యం ఏ కవితలోనూ ఎలాగూ ఉంటుంది. ఉండకపోతే అది కవిత కానేకాదు. దానిని కవి రాయనే రాయడు. కాని వ్రాస్తున్నది మొదట వచనమా లేక కవితయా యనునది కవి తేల్చుకోవాలి". శేషేంద్ర కవితను ఇంత నిశితంగా వివేచించిన వెల్చాల "శేషేంద్ర 'నీతి' కవి కన్నా ఎక్కువ 'రీతి' కవి, సిద్ధాంత (ఐడియలాజికల్) కవి కన్నా ఎక్కువ ఆదర్శ (ఐడియలిస్టిక్) కవి" అని ప్రతిపాదించడం ఆ కవిపై విమర్శలకే 'హైలైట్'.

"శేషేంద్ర శర్మ కవుల వర్గాల్లో ఏ వర్గానికి చేందేవారు కాదు. సర్వస్వతంత్రుడుగా, దాదాపు ఏకాకిగా ఉండేవాడు. అందుకే అతడు ఆఖరువరకు కూడా ఏ 'వర్గకవీ' కాలేకపోయాడు. అందుకే అతనికి అప్పటికీ ఇప్పటికీ ఆతని కవిత్వాన్ని ఆనందించేవారు, అభినందించేవారు తప్ప అతనికి చెందిన 'వర్గీయులు' అనే వారు లేరు. 'అడ్మైరర్స్' తప్ప అంటిపెట్టుకొని ఉన్నవారు లేరు". ఇదీ శేషేంద్రపై వెల్చాల నిష్కర్ష.

శేషేంద్ర శర్మ వలెనే ఏ 'వర్గానికీ' చెందని మరొక మహాకవి విశ్వనాథ సత్యనారాయణ. దేశం పట్టనంత మహా రచయితయైన సత్యనారాయణపై అసంఖ్యాకమైన వ్యాఖ్యానాలూ, విమర్శలూ వెలువడ్డాయి. ఆయన నవలల్లో గొప్పవియైన వేయిపడగలు, ఏకవీర నవలలపై పలువురు పలు అభిప్రాయాలు వెలువరించారు. అయితే కొండలరావుగారు విలక్షణమైన దృష్టితో వాటిని దర్శించి వినూత్నమైన రీతిలో తమ భావాలను వ్యక్తీకరించారు.

"విశ్వనాథవారి 'వేయిపడగలు' ఒక దాంపత్య రహస్యాన్ని చెబుతుంది. అది మంచి దంపతులకు మంచి సంతానం కలుగుతుందనునది. ఈ భావం కొరకే విశ్వనాథవారు వేయిపడగలు రాశారనిపిస్తుంది" అని 'లోచూపు'తో అనగల అంతరార్థాన్ని చాటి చెప్పారు. దీనికి హేతువుగా అందలి పాత్ర తత్త్వాన్ని ఇలా వెల్లడించారు –

"విశ్వనాథవారు ఈ నవలలో రెండు ప్రధానమైన పాత్రలు సృష్టిచారు. 'పాతివ్రత్యానికి' ప్రతీకగా అరుంధతిది, 'ధర్మానికి' ప్రతీకగా ధర్మారావుది. నవలంతా వీరిరువురి చుట్టూ, వారి ద్వారా భారతీయ సంస్కృతి చుట్టూ నడుస్తుంది. నవలలో అంతస్స్రవంతిగా విశ్వనాథవారు 'పురుషార్థాన్ని' కూడా స్పృశిస్తారు. పాతివ్రత్యాన్ని, పురుషార్థాన్ని ధర్మాన్ని ఒకటిపై ఒకటి ఆధారపడే విలువలుగా."

విశ్వనాథ దృష్టిలో 'కృతజ్ఞతాభావం' చాలా అమూల్యమైనదని, దానికి ధర్మం, మంచితనం ఆలంబనలని ధర్మారావు పాత్ర ద్వారా సువిదితం చేశారని వెల్చాల విశదీకరిస్తారు. "భార్యాభర్తలను ఇరువురి యెడ కృతజ్ఞతా భావముంటేనే వారి సంబంధాలు బాగుంటాయి. అవి బాగుండకపోతే పాతివ్రత్య భావం, ఏకపత్నీవ్రత భావం కుంటుపడతాయని, తద్వారా సంతానం కలుషిత మవుతుందని, సంతానం కలుషితమైతే సంఘక్షేమం, దేశక్షేమం, విశ్వక్షేమం దెబ్బ తింటాయని జనులు అనేకానేక బాధలకు, సంక్షోభాలకు గురవుతారని విశ్వనాథవారు వెల్లడిస్తారు" అంటూ వేయిపడగలులోని విశ్వనాథ హృదయాన్ని విప్పిచెబుతారు.

ఆమధ్య సుప్రీంకోర్టు వారు పెళ్ళికాక పూర్వపు లైంగిక సంబంధాలను సమర్థిస్తూ ఇచ్చిన తీర్పు వలన సంభవించే దాంపత్య జీవితాల అయోమయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని

సామాజిక స్పందనతో "భారతీయ దాంపత్య వ్యవస్థయే భారతీయ సంస్కృతికి పునాది" అన్నది వేయిపడగలు ప్రధాన లక్ష్యమని కొండలరావుగారు ఉగ్గడించారు.

ఇదే అంతర్వీక్షణంతో 'ఏకవీర' నవలా కథ పరమార్థాన్ని వివరించిన తీరు ఆయన విలక్షణతను చాటుతుంది. ఏకవీర నవలలో ప్రేమకంటే స్నేహధర్మానికే విశ్వనాథ పెద్ద పీట వేశారని ఆయన అభిప్రాయం –

"The aim of Vishwanatha in writing this novel appears to be moreto high light the sublimity of friendship than the sublimity of love, and to do that, unless a character like that of Ekaveera was introduced there would not have been a scope, hence it was introduced". (Viswanatha A Literary Legend; p.375)

అయితే ఉదాత్తమైన ఈ 'స్నేహం' 'త్యాగ' రూపంలో పర్యవసించిందని ఆయన వివరించారు. ఏకవీరు, కుట్టాన్, వీరభూపతి – నవలలోని మూడు ప్రధాన పాత్రలూ – 'ధర్మం' కొరకు వారి ప్రేమను త్యాగం చేసినవారే.

శేషేంద్ర, విశ్వనాథలపై వివిధ సందర్భాలలో వెల్చాల రచించిన వివేచనాత్మక వ్యాసాలు ఒక రచయితను ఎలా అధ్యయనం చేయాలో సూచించే "బాల (ప్రౌఢ) వ్యాకరణాలు" అంటే అత్యుక్తి కాదు.

"కవిత్వం రాయదలుచుకున్నవారు విశ్వనాథను, శేషేంద్రను క్షుణ్ణంగా, జాగ్రత్తగా చదవాలి. వారి ఇతర భావాలతో మనం ఏకీభవించకపోతే ఏకీభవించకపోవచ్చు. కాని వారి సాహిత్య భావాలను మాత్రం మనం కాదనలేం కనుక, వాటిని గౌరవించాలి, గుర్తించాలి, పాటించాలి" అన్న వాక్యాలు కొండలరావుగారి సహృదయతకు, నిష్పాక్షికతకు తార్కాణాలు.

"ఆధునిక నాగరికత ప్రధానంగా ఆడంబరానికి, అదుపులేని తనానికి, పొదుపు లేని తనానికి, మితిలేని తనానికి చెందింది. వాటి వలన సహనమూ, సర్దుబాటు కన్నాఎక్కువ తెలిసీ తెలియని స్వేచ్ఛాభావాలు, స్వతంత్ర భావాలు విస్తృతంగా వ్యాపిస్తాయి" అని గుర్తించిన నేటి కుహనా నాగరికతపై స్పష్టమైన అవగాహన కలిగిన మేధావి వెల్చాల కొండలరావు గారు. అందుకే "రచయితకు 'యోగి' లాంటి దృష్టుండాలి. యోగి అనగా నిచట ముని, తపస్వియని కాదు, అర్థం. మనో మాలిన్యత, భావమూర్ఖత లేకుండా – విషయాన్ని విశాలమైన దృష్టితో, విలీనతతో, వ్యక్తి అహంకార నిర్మూలితమైన చింతనా దృష్టితో చూడగలిగిన వాడని యర్థం" అని నిశ్చితంగా, నిర్దిష్టంగా 'రచయిత'ను నిర్వచించారు.

ఆయన వ్యాస వాహినిని 'లోతు'గా పరిశీలిస్తే ఇలాంటి భావాల 'మణులు' ఎన్నయినా వెలికి తీయవచ్చును.

**–ఆచార్య ఎస్వీ రామారావు**
Former Head, Dept. of Telugu &
Dean, Faculty of Arts, OU

-*-*-

# శేషేంద్ర స్మృతిలో...

మహాకవి శేషేంద్ర మనకిక లేరు.

శేషేంద్ర ఎంత గొప్ప కవో, ఎంత గొప్ప పండితుడో అంత గొప్ప విమర్శకుడు. నవ్య కవిత్వానికి ఆతడొక శక్తిమంతమైన నూతన శైలిని, అధునాతన అభివ్యక్తిని ప్రసాదించిన నవ కవితాపితామహుడు.

బహు భాషల్లోకి అనువదించబడిన శేషేంద్ర ఒక ఆంధ్ర కవే కాదు, భారతీయ కవే కాదు, విశ్వ కవి.

ఒక పువ్వును చూస్తూ శతాబ్దాలు గడపగలనన్న అతి సుకుమారమైన, సున్నితమైన కవి. I am a victim of beauty, it chases me like a hunter chases a wild animal అంటాడు. అందం చేతిలో అతడొక బందీ. అందం అతని స్ఫూర్తి, అతని ప్రేరణ, అతని అనుభూతి, అతని ప్రపంచం. అతడు అందంగా ఉండేవాడు, అందమైన వాతావరణంలో ఉండేవాడు, అందం కంటే, వింటే పరవసించేవాడు. అందమే అతనికి అర్థం, సార్థం, పరమార్థం. అందం గురించి అంత అందంగా వ్రాసేవాళ్ళు, వ్రాసిన వాళ్ళు చాలా అరుదు.

శేషేంద్ర అన్ని కళలను, కళా వాదాలను జీర్ణించుకొని సమన్వయించుకొని వ్రాసిన సమగ్ర కవి. ప్రకృతి, మానవుడు రెండే రెండు అతనికి కవితా వస్తువులు. ఏది వ్రాసినా దానిలో ఈ రెండింటినీ ప్రస్ఫుటంగా ప్రతిబింబించేవాడు – వివిధ కోణాలుగా, వివిధ అనుభవాలుగా, వివిధ అనుభూతులుగా.

"మీ కవితలు చదువుతుంటే నా గుండెల్ని నేనే విప్పి చదువుకుంటున్న అనుభూతి పొందాను" అన్నారు సోమ సుందర్‌గారు శేషేంద్రగారికి వ్రాసిన ఒక లేఖలో. అది వారి రచనలు చదివిన వారికి అందరికీ వర్తిస్తుంది.

"కవిత్వం ఒక మాయ, ఒక ఇంద్రజాలం, ఒక మెస్మరిజం, కవి కన్ను ఒక ప్రిజం" అని అన్నారు శేషేంద్ర. అక్షరాలా వారి కవిత్వం అలాంటిదే. అదొక మ్యాగ్నటిజంలా మనని పట్టేస్తుంది, చుట్టేస్తుంది. పరవశానికి లోను చేస్తుంది.

మనిషిగా శేషేంద్ర నిగర్వి, కవిగా సగర్వి. అతనితో ప్రాబ్లం ఏముండేదంటే, అతడెప్పుడూ సాహిత్యం గురించి సాహిత్య భాషలోనే మాట్లాడేవాడు. అతనితో సంభాషణంతా సాహిత్యం గురించిన సంభాషణే. సాహిత్యం గురించి మాట్లాడేటప్పుడు అతడెప్పుడూ మంచె ఎక్కి మాట్లాడేవాడు, దిగి కాదు. మంచె క్రింది వాళ్ళంతా అతనిని గర్విష్ఠిగా, అహంకారిగా భావించేవారు. అది సహజం. అది శేషేంద్ర దోషం కాదు, వారి దోషం. శేషేంద్ర స్థాయికి వారు ఎదగరు. వారి స్థాయికి శేషేంద్ర దిగిరాలేదు. విశ్వనాథ సత్యనారాయణగారు "ఇదేమి చోద్యం! నేనెదిగాను, ఎదిగిన భాషలో ఎదిగిన భావాన్ని వ్రాశాను, వ్రాస్తాను. వారు నా స్థాయికి ఎదగక వారి స్థాయికి నన్ను దిగిరమ్మంటారేమిటి" అని అనేవారు. అది శేషేంద్రకు కూడా వర్తిస్తుంది.

శేషేంద్ర శర్మగారిని నేను ఎన్నో సార్లు చూచాను. నాకు వారు ఎప్పుడూ ఏదో సమాధి

స్థితిలో ఉన్నట్టుగానే అగుపడేవారు. అది ఒక జ్ఞాని, ఋషి స్వభావం. అందుకే వారి భాష కృషి భాషగా కాక ఋషి భాషగా రూపొందింది.

మామూలు వాళ్ళకు ఒకే ఒక స్థితి ఉంటుంది. సంపాదించే స్థితి, సుఖించే స్థితి. కాని ఒక ధ్యానికి, జ్ఞానికి, ఋషికి ఎన్నో స్థితులుంటాయి, ఎన్నో లోకాలు. ఆ మధ్య జువ్వాడి గౌతమరావుగారిని ఎవరో "మీరీమధ్య అదేదో పరధ్యానంగా ఉంటున్నారని కొందరంటున్నారు నిజమేనా" యని అడిగితే "నాది వారికి పరధ్యానం, నాకు అది ధ్యానం, వారికి ఒకే ఒక లోకం, నాకు అనేకానేక లోకాలు. నేనపుడు ఏ లోకంలో ఉంటానో నాకే తెలియదు వారికెలా తెలుస్తుంది." అని అన్నారట. కొందరి గురించే కాక అందరి గురించి ఆలోచించే అద్వైతుల్లాంటి వారందరూ అలాగే ఉంటారు.

"నేను నా ధ్యానంలో ఉన్నప్పుడు కాలం కూడా కాలు కదల్చితే కార్చిచ్చులా లేస్తాను" అని అంటారు శేషేంద్ర ఒక చోట. అలాంటి వారే అసహనులు, అహంభావకులుగా కనబడతారు వారిని అర్థం చేసికోనివారికి. కాని అసలు విషయం అది కాదు. అలాంటి వారి మధ్య వారి కంటే తక్కువవారు అదొక విధమైన Inferiority Complex కు గురౌవుతారు. వారు కూడా వారంతటి వారే అయితే వారు కూడా వారిలో ఒకరిగానే ఫీలవుతారు.

శేషేంద్ర లాంటి జీవులంతా చాలా అరుదైన, జాతికి అతి విలువైన జీవులు. చేరా గారన్నట్లు వారు అన్ని పురస్కారాలకూ అతీతులు. వారి అభిమానులు, వారి పుస్తకాలు చదివినవారు, వారిని కన్న, విన్నవారే వారికి అసంఖ్యాక పురస్కారాలు.

"జయంతి" వైపున వారికి జోహార్లు అర్పిస్తున్నాం. కాని వారికి నిజమైన జోహార్లు అర్పించడం వారి పుస్తకాలు చదివి, అర్థం చేసికొని, వాటిని పది మందితో చదివించడమే. అది వారికి మనమిచ్చే నిజమైన గౌరవం, నిజమైన గుర్తింపు, అన్ని పురస్కారాల కన్నా అది వారికి మనమర్పించే అతి గొప్ప పురస్కారం.

వారి సతీమణి ఇందిరాదేవిగారికి, శేషేంద్ర కుటుంబీకులందరికి నా ప్రగాఢ సంతాపం తెలుపుతున్నాను. శేషేంద్ర అనే పుష్పానికి ఇందిర ఒక కాడలాంటివారు. కాడ లేందే పూవులేదు. శేషేంద్రగారిని వారు వారి తుది ఘడియ వరకు వారి కనురెప్పవలె ఒక పిల్లవానిని చూచుకొన్నట్లు చూచుకొన్నారు. వారికి అన్ని విషయాలలో అండదండగా ఉండి ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని, ప్రేరణను, స్పందనను సమకూర్చారు. వారిని అనేకానేక దేశాలకు తీసికెళ్ళి వారంటే ఏమిటో వారికి తెలిసేటట్లు, వారిని వారు అభినందించేటట్లు చేశారు. వారి పుస్తకాలు అందంగా అందరికి అందుబాటులోకి తెచ్చారు. వారి సుఖ దుఃఖాలలో వారి వెనువెంట నడచి, వెన్నంటి, వెన్నుతట్టి వారిని ముందడుగు వేయించారు. శేషేంద్రగారు నివసించే అందమైన గూటిలో, శేషేంద్ర ఇందిర చిలుకా గోరింకలుగా గడిపారు. అది ఇపుడు ఎంతో చిన్నబోయింది. అచటికి పోయే వారందరికి అది ఇపుడు ఆత్మ కోల్పోయి హృదయం మిగిలినదానిలాగుంది.....

# సముద్రం నా పేరు

**క**వులకు, వారి తల్లిదండ్రులు పెట్టిన పేర్లే కాకుండా వారికివారిచ్చుకున్న "కలం పేర్లు" కూడా కొందరికుంటాయి. ఉర్దూలో వీటిని "తఖల్లుస్" అంటారు. ఉర్దూలో రాసే కవులు వీటిని వారి కవితా పంక్తుల్లోని ఆఖరు చరణంలో తరచుగా వాడుతారు.

మన తెలుగు కవులు కూడా చాలా మంది "ఉషశ్రీ", "కరుణశ్రీ", 'అజంతా', 'ఎల్లోరా' 'ఆరుద్ర' లాంటి కలం పేర్లు పెట్టుకున్నారు.

సాధారణంగా ఇవి చిన్నగా, ముద్దుగా, ముచ్చటగా ఉంటాయి.

శేషేంద్ర "నా పేరు సముద్రం" అని అంటాడు ఆతని "ఆధునిక మహాభారతము" అను గ్రంథంలో, సముద్రమనే పదాన్ని అతని కలం పేరుగా. ఆతడా పదాన్ని అనేకానేక కవితల్లో ఇతరత్రా కూడా వాడుతాడు. అలాగే "తుఫాను", "ఝంఝూ మారుతాం" అను పదాలను కూడా. వాటిలో కొన్నిటిని దిగువ ఉదహరిస్తున్నాను.

"మనుషులందరూ నడిచే సముద్రాలే."

"సముద్రాలెక్కడ ఆకాశాల్ని పిడికిళ్లతో పొడుస్తుంటాయో అక్కడికే పోతాను, తుఫానులతో స్నేహం చేస్తాను, సింహాల సౌందర్యాన్ని ఉపాసిస్తాను, నా ప్రాణాలక్కడే పారేస్తాను."

"మనిషి నా పద్యంలోకి వచ్చి ఇరుక్కున్న ఒక తుఫాను, నేను జీవిత అఖాతంలో ఇరుక్కున్న ఒక సముద్రం."

"నా పేజీ మీద ఒక సముద్రం పెడతా, దాని మీద ఒక పడవ పెడతా, దాని మీద ఒక తుఫాను ఊదుతా, అది పడవయి ఏ తీరాన కొట్టుకుపోతుందో చూస్తూ, యుగ యుగాల్లో శిలువ వేయబడిన ప్రాణాల అస్థిపంజరాలన్నీ ఏకాలపు తీర రేఖ తాకుతాయో చూస్తా."

"జీవన సముద్రమంతా ఈదాను, అక్షరాన్ని ఒక బెలూనులా ఉదాను, ఒక్క బొట్టు కన్నీటిలో నుంచి ఎంతో దుఃఖం చేదాను."

"సముద్రమైన మనిషిలో నుంచి సత్యం ఎండిపోవడం చూస్తే ధరిత్రి మీద సముద్రాలు ఎండిపోతాయోమోనని భయమెస్తోంది, పర్వతాలు పారిపోతాయేమోనని భయమేస్తోంది, వృక్షాలు పుష్పవతులయి నడిచే రోజు రాదని భయమేస్తోంది."

"చేతులన్నీ కలిపి సిద్ధమైనామంటే ఏడు సంద్రాలైనా ఈది పారేస్తాము."

"నీ కన్నుల్లో సముద్రాలే కదులుతాయి పసిపిల్లల్లా."

"అరే, దిశాంతాల వరకూ వ్యాపించిన ఈ విశాల అసహాయతా వలయంలో ఏది సముద్రమో, ఎవడుగట్టున ఉన్నాడో ఎలా తెలుస్తుంది."

"సూర్యుడు సముద్రాల మీద వంగి నీళ్ళు త్రాగే గుర్రం."

"ఒక కళను నా ప్రపంచంగా మలుచుకుందామని కూర్చుంటే సముద్రం సహస్ర బాహువులెత్తి బెదిరిస్తోంది, నీలి ఆకాశపు లోతుల్లో ఎక్కడో ఒక తార."

"సముద్రం ఒక కెరటాల సంకలనం కాదు, సముద్రం ఒక భాష, సముద్రం నాపేరు!"

" నీకెలా తెలుస్తాయి సముద్రపు లోతులు? సముద్రమొక మార్మిక ద్రవ్యం! సముద్రపు నాడుల్లో ఎన్ని పర్వత శ్రేణులున్నాయో, దాని పేగుల్లో, అంతరాళాల్లో ఎన్ని నాగరికతలు జీర్ణమై పోయాయో, దాని రక్తప్రవాహాల్లో ఎన్ని యుగాల మన్వంతరాల అగ్నివేదనలు, విస్మృత ఆత్మల సాహసోపేత యాత్రలు ఘుర్ఘురధ్వనులు చేస్తున్నాయో నీకెలా తెలుస్తుంది."

"నిన్న సముద్రం ఒక అశ్వధాటితో పరుగెత్తింది ఒక్కో తరంగం ఒక్కో ప్రతీకలా, ఒక్కో అలంకారంలా – ఈ వేళ ఆ సముద్రం విరిగిపడుతున్న భారీ కెరటాలూ, తెల్లటి నిరాశలాంటి నురుగుల సమూహాలూ, తీరాల మీదపడి గొంతుకోల్పోయిన శంఖాలూ ఛిన్నాభిన్నమైన నత్తగుల్లలూ, శాశ్వతంగా నీళ్ళు పోగొట్టుకున్న భగ్ననౌకలూ – అంతా నా గొంతు పేజీల్లోకి కుంగిపోయిన ఒక మానవ అవయాల శిథిలరాజధాని;"

"సముద్రం ఒకడి కాళ్ళ దగ్గర కూర్చొని మొరగదు, తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు, పర్వతం ఎవడికీ వంగి సలాం చేయదు, నేనింతా ఒక పిడికెడు మట్టే కావచ్చు కాని కలమెత్తితే నాకు ఒక దేశపు ఝుండాకున్నంత పొగరుంది." లాంటి వాక్యాలు అచటచటా వాడుతాడు."

శేషేంద్ర నిజంగానే ఒక కవితా సముద్రం, కవితా తుఫాను, కవితా ఝుంఝూ మారుతాం, దానికి ఏ అనుమానమూ లేదు. అతడు రాసినవి రాసిగా తక్కువే అయినా వాసిగా సముద్రమంతటి అర్థం, సార్థం, అలంకారం కలవి.

ఈ యుగపు కవులల్లో ఆతడు ఆతని "కవితారీతి" ద్వారా మేటిననిపించుకున్నాడు. కవితా సముద్రంలో అనేకానేక కొత్త పొకడలు పోయాడు, సరి కొత్త పదాలు, పద బంధాలు, అలంకారాలు సృష్టించాడు. శేషేంద్ర "కొత్త నీతి" కవి కంటే ఎక్కువ "కొత్త రీతి" కవి. ఆ మార్గంలో అతడొక "మార్గదర్శకుని" లాంటి, ట్రెండ్ సెట్టర్‌లాంటివాడు. ఆతడు పద్యం రాసినా, పాట రాసినా, గేయం రాసినా, తనదైన అలంకార భాషలో, తనదైన పదజాలంతో, శైలితో రాశాడు. ఆతడు అలంకార కవి కూడా, అభ్యుదయ కవి కూడా. ఒక విధంగా చెప్పాలంటే ఆతడు "భావభ్యుదయ" కవి కన్నా ఎక్కువ "భావాభ్యుదయ" కవి. ఎందుకంటే అతడు అభ్యుదయ కవుల్లో కూడా భాషలో అనేకానేక 'అలంకారాలు' 'ప్రతీకలు' ప్రవేశపెట్టిన ఏకైక కవి.

తెలుగు కవితా రంగాన్ని తీసికుంటే శేషేంద్ర కవితల కన్నా పూర్వం వచ్చిన అలంకార కవితలన్నీ చాలా వరకు పాత అలంకారాలకు, పదాలకు, పదబంధాలకు, పద ప్రయోగాలకు చెందినవే. పాత అలంకార కవులల్లో కొత్త అలంకార ప్రయోగాలను ప్రవేశపెట్టిన వారు చాలా అరుదనే చెప్పాలి. బహుశః అలాంటి ప్రత్యేకత శేషేంద్రకొక్కరికే దక్కుతుందేమో. అతని కవితల్లో మనకు భాషా కొత్తదనం అడుగడుగునా సాక్షాత్కరిస్తుంది. సాధారణంగా, కవులు అలంకార పదాలను భావ కవితల్లో, శృంగార కవితల్లో, ప్రకృతి కవితల్లో, ఆత్మా శ్రయ కవితల్లో ఎక్కువ వాడుతారు, అభ్యుదయ కవితల్లో, చాలా తక్కువ. అభ్యుదయ కవితల్లో కూడా అలంకార పదాలు విరివిగా వాడిన ఘనత బహుశ శేషేంద్రకే దక్కుతుందేమో.

శేషేంద్ర తన 'కవిసేన మేనిఫెస్టో'లో కవి ఏది రాసినా, దేనిని కవితా వస్తువుగా స్వీకరించినా,

ప్రధానంగా అది కవిత కావాలి, ఆ పిదపే తక్కినవన్నీ అంటాడు. కవిత్వం యొక్క మొదటి లక్ష్యం అది కవిత్వం కావడమంటాడు. కవి మొదట కవిత్వం రాయదల్చుకుంటాడు, వచనం కాదు, కవిత్వం కొరకు వస్తువునెన్నుకుంటాడు కాని వస్తువు కొరకు కవిత్వాన్ని కాదంటాడు. కవి రాసేది కవిత్వం కావాలంటే దానికి "అలంకారం" తప్పనిసరి యని ఖచ్చితంగా చెబుతాడు. అందుకే అతడు ఏది రాసినా ఆ దృష్టితోనే రాశాడు. ఇదే విషయాన్ని బాలగంగాధర్ తిలక్ తన "అమృతం కురిసిన రాత్రి" కావ్యంలో ఇలా అంటాడు.

**మిత్రమా!**
**కవిత వున్నప్పుడే నవత రాణిస్తుంది**
**అసలు కవితలోనే నవతకూడా వుంది.**
**అన్నా! కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి,**
**విస్తరించాలి చైతన్య పరిధి,**
**అగ్ని జల్లినా, అమృతం కురిసినా**
**అందం, ఆనందం దాని పరమావధి.**

ఆ మధ్య ఒకసారి సుప్రసిద్ధ కేరళ సాహిత్య సద్విమర్శకుడు కీ.శే. పణిక్కర్‌గారు హైద్రాబాదులో ఉపన్యసిస్తూ "Whether a poet writes poetry with a "Public" purpose or "Private purpose," the voice of poetry should be private." అన్నారు.

ఇచటవారు "ప్రైవేట్" అను పదాన్ని ' ప్రతి ధ్వని' అను అర్థంలో వాడారు. అంటే, చెప్పేది భావ కవిత్వమైనా, అభ్యుదయ కవిత్వమైనా, మరేదైనా, భాష మాత్రం "ప్రతిధ్వని" లాంటిది కావాలి కాని ధ్వని లాంటిది కాగూడదని, It should be voice but not noise అని వారి భావం.

మరొక అమెరికన్ మహాకవి ఆర్చి బాల్డ్ మ్యాక్లీష్ "When the metaphor dies, the poetry dies." అన్నాడు, కవిత్వంలో అలంకారానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ.

శేషేంద్ర, కవిత్వ శాస్త్రం, కవిత్వ శిల్పం గురించి సముద్రమంత అవగాహన ఉన్న కవి. దేశ విదేశ సాహిత్యాలు తులనాత్మకంగా అధ్యయనం చేసిన కవి. He is a very conscious, a very well cultivated poet, apart from his culture and genius. అతడు విషయం కొరకు కవిత్వం రాయడు, కవిత్వం కొరకు విషయం రాస్తాడు. చాలా మంది అభ్యుదయ కవులకూ అతనికీ అదీ తేడా. చాలా మంది అభ్యుదయ కవులు విషయం కొరకు కవిత్వం రాస్తారు, కవిత్వం కొరకు విషయం రాయరు. దాని వలన విషయం కవిత్వాన్ని దెబ్బ తీస్తుంది, కవిత్వం కవిత్వం కాకుండా పోయి విషయం మాత్రం మిగులుతుంది, భావం. అందువలననే అభ్యుదయ కవిత్వం రాసిన వాళ్ళల్లో కూడా శేషేంద్ర స్థాయి వేరు. అతడు అభ్యుదయ కవిత్వం కవిగా రాశాడు కాని ideologist గా కాదు. అందుకే అతనికి ideological stamp పడలేదు, బహుశ పడదు కూడా.

శేషేంద్ర అతని "నా దేశం – నా ప్రజలు", "గొరిల్లా", "సముద్రం నా పేరు" "మండే సూర్యుడు" మున్నగు రచనల ద్వారా అభ్యుదయ కవిత్వానికి సముద్రమంత సరికొత్త దారి చూపించాడు, అలంకార కవిత్వానికయితే సరేసరి. అందువలన ఆతడు అటు అలంకార కవులకు, ఇటు అభ్యుదయ

కవులకు "మార్గదర్శి" లాంటివాడయి, "సముద్రం నా పేరు" అని సగర్వంగా చాటుకోగలిగాడు.

శేషేంద్ర దృష్టి ప్రధానంగా సౌందర్య దృష్టి. శేషేంద్ర దృక్పథం ప్రధానంగా సౌందర్య దృక్పథం. ఆతనికి సౌందర్యమంటే అమితమైన బలహీనత. ప్రతీదీ సౌందర్య దృష్టితోనే చూచాడు. వస్తువులు అతనికి కేవలం వస్తువులు కావు, సముద్రాలు. వాటిని సముద్రాల్లా చూడగలిగితే అవి చూచేవారి కళ్ళకు అనేకానేక అర్థల్లో, అందాల్లో, సార్థాల్లో సాక్షాత్కరిస్తాయని ఆతని అభిప్రాయం.

ఈ సందర్భంగా నా "వస్తువులు సముద్రాలు" అనే పుస్తకానికి వారు రాసిన పీఠికను ఇచట ఉటంకించడం సందర్భోచితంగా నేను భావిస్తున్నాను.

"మనుషులంతా ఒకటే కావచ్చు; కాని లోకంలో నేత్రాలన్నీ ఒకటే కావు. కొన్ని నేత్రాల్లో ప్రిజంలు (Prisms) ఉంటాయి. అవి అపరిచిత నేత్రాలు.

శ్రీ కొండలరావుగారు ఎప్పుడూ చూచే నా మిత్రులే అయినా, వారి ఈ కావ్య కృతిని (వస్తువులు సముద్రాలు) చూచినప్పుడే ఆయనవి అపరిచిత నేత్రాలని అర్థంచేసుకున్నాను. అన్ని నేత్రాలకు సాధారణ రూపాలతో కనుపించే వస్తుజాలం ఆయన నేత్రాలకు విశేషార్థాలతో ఒక రహస్యమయ మాయావిలాసంగా కనుపిస్తుంది. జీవితం క్రోడీకృతమై ధరించిన సాంద్రరూపమే ఈ ప్రిజం (Prism). ఆయన కృతిలో ప్రతి పంక్తీ ఈ విషయమే చెపుతుంది. ఆ పంక్తులు కొన్ని :

1. ఈ దీపం శాపంగా ఉంది.... చీకటి వెలుతురుగా ఉంది, స్వర స్వరాన్ని నరనరంగా నలిపేస్తోంది.

2. ప్రాణం మేఘమై పయనిస్తోంది! ఉరుముల్లా ఉప్పెనలా లేస్తోంది.

3. వర్షించేది వర్షం! వర్షించనివెన్నో ఉన్నాయి, మరి కావా అవి వర్షాలు! ఎద ఎద నిండా మేఘాలు! నది నది నిండా అలలు! తీరాన్ని తాకకుండానే తిరిగిపోయే కలలు.

4. ఎందుకు నేనిలా ఒకే మనిషిని ఎందరో మనుషులుగా ప్రవహిస్తున్నాను, నేనే నేను కాకుండా ప్రవహిస్తున్నాను.

5. మొదలెట్టానుకనుక మొదలన్నానిది. తుదికొచ్చాను, నిజంగానే తుదియా మరి యిది! తుది నుండి మొదలెడితే ఏమై ఉండెడిది?

6. ఎవరున్నారీ మహా ప్రపంచంలో ఒకరిలాగా మరింకొకరు, ఈ సృష్టంతా ఎవరికివారే! ఒకే ఒకరిగా కనబడువారు.

7. ఆకాశమొక సముద్రం! కాలమొక సముద్రం.... జీవిత మొక అలల కలల సముద్రం.

ఈ పంక్తులు వట్టి ఊహల శిల్పాలనుకోను; మనుష్య చేతన లోతుల్లో మునిగి ఉన్న నాగరికతలనుకుంటాను. కనకనే ఆయనవి మామూలు నేత్రాలనుకోను. వస్తువులనే సముద్రాల్లో రహస్యాలనే సాహస ద్రవ్యాలకోసం వేటాడే నావికులు. నిజానికి కెరటాలతో ఆయన చేసే పోరాటం అదృశ్యం; అంధకారం వీస్తున్న కాంతుల గాలివానల్లో చేస్తుంటాడు ఆ పోరాటం. ప్రతి వస్తువునీ అనుమానిస్తున్నాడు, పట్టుకొని ప్రశ్నిస్తున్నాడు, నీ రహస్యాల్నీ, నీ గర్భిత వర్ణఖనిజాల్నీ కొల్లగొట్టడానికి

వచ్చిన సాహస యాత్రికుడ్ని అని ఉద్ఘోషిస్తున్నాడు. అప్పుడు ఆయన అక్షరాల అడవుల్లో వాక్యాలు నదులై ప్రవహిస్తాయి, ఆయన ఈదుతాడు, పరుగిడుతాడు, ప్రతిధ్వనుల విస్ఫోటాలు చేస్తాడు; ఈ ఆత్మిక సంకుల సమర తంత్రంలో పడి ఒక్కో పొయెం (Poem), ఒక్కో ధమాకా అవుతుంది. అయితే మనం ఆయన సాహస యాత్రల్లో పాల్గొనాలి, ఆయన పేజీల్లోకి దూకాలి, ఆయన వెంట పరుగులెత్తాలి; అపుడు తెలుస్తుంది, ఈ సాహసోపేత కార్యాల్నే సామాన్య భాషలో కవిత్వమంటారని.

నిజమైనకవి దైనందిన చక్రంలో పడి వ్యావహారిక సత్యాల బరువులు మోస్తున్న మనిషే; జీవితాన్ని గర్హిస్తున్న సన్యాసి కాదు. దీని ప్రభావం ఆయన అభివ్యక్తి మీద ఉంటుంది. జీవన స్పర్శచేత, కవి భాష, సాధారణంగా అకృత్రిమ వర్ణ విన్యాసంగా ఉంటుంది. కేవల భాషాలంపటత్వంగా వ్యవహరించదు. చిత్ర విచిత్ర భాషాక్రీడల్ని sophistication అనుకోవడం కలదు. వాస్తవంగా sophistication భావనాశైలికి చెందిన కళ. దాని ప్రభావమే భాషకు సహజంగా సంక్రమిస్తుంది.

కొండలరావుగారిలో sophistication ఆవిధంగా ఉంది. అన్యధా లేదు – అంటే సాధారణ పఠిత వెదికే ప్రగల్భతలేదు. కాని లోతైన లోతులకున్న అమాయకత ఉంది. పువ్వుల పరీమళంలా, కొండవాగుల కలధ్వనిలా, పక్షుల పాటలా, కనిపించని లోతులు గర్భితం చేసుకున్న శబ్దం ఆయనది. ఆయన శబ్దం నిజంగా నిశ్శబ్దం! శబ్దం మనిషిని బలాత్కరించలేదు, కానీ నిశ్శబ్దం?

"రమ్యాణివీక్ష్యమధురాంశ్చ నిశమ్యశబ్దాన్
పర్యత్సుకో భవతి యత్సుఖితోపి జంతుః"

అన్న కవి ఎంత సత్యాశ్రయుడు. ఆయన వాక్కు ఎంత బలవతి!

ఈ కృతి తంత్రులు మీటుతూ మీటుతూ నా శ్రవణేంద్రియం, ఇంగ్లీషు కవి ఈ.ఈ. కమ్మింగ్స్ గళాన్ని స్మృతి పధానికి తెస్తోంది.

ఆయన తన కవితల్ని పరిచయం చేస్తూ ఇలా అంటాడు – "The poems to come are for you and for me and are not for most people. It is no use trying to pretend that most people and ourselves are alike. Most people have less in common with ourselves than the square root of minus one. You and I are human beings; most people are snobs...... you and I are not snobs. We can never be born enough. We are human beings, for whom, birth is supremely welcome mystery; the mystery of growing; the mystery, which happens only and whenever we are faithful to ourselves". ("Modern Poets on Modern Poetry" నుండి.

కవిగా శ్రీ కొండలరావుగారు రహస్యమయతలో ఉన్న రమణీయతను భగ్నం చేయకుండా రహస్యదర్శన లబ్ధిపొందిన వాస్తవికతా తత్త్వవేత్త; తన అంతర్ బహిర్ అభివ్యక్తుల మధ్య అపశ్రుతిలేని అద్వైతి. ఆయన తన నూతన యాత్రలో గమ్యస్థానం చేరుతాడని నా విశ్వాసం."

ఇవి శేషేంద్ర నా పుస్తకానికి రాసిన పీఠికల్లోవి అయినా, ఇవన్నీ ఆతడు తన "ఆధునిక మహాభారతం"లో అచటచటా పేర్కొన్నవే కనుక, నేను వీటిని ప్రత్యేకంగా నా కొరకు మాత్రమే రాశాడని భావించడం లేదు. ఈ భావాలు ఆతని మౌలికమైన విశ్వాసాలని భావిస్తున్నాను. ఆతడు

వస్తువులను అలాంటి కళ్ళతో చూచిన కవి. వాటిలో సరిక్రొత్త అర్థాలు, సార్థాలు, సౌందర్యాలు కనుగొన్న కవి. అందుకే ఆతడొక Inventor, discoverer, pioneer, promoter, entreprenuer, explorer, risktaker, venturer, adventurer లాంటివాడు. అందుకే అన్నాడు "నా పేరు సముద్రం" అని. అంత సత్తా ఉన్న కవి కనుకనే.

మహాకవి పాబ్లో నెరూడా ఒక చోట **" I have a mind to confuse things, unite them, make them new - born, mix them up, undress them, until all light in the world has the oneness of the ocean, a generous, vast wholeness, a crackling, living fragrance."** అని అంటాడు. అది శేషేంద్రకు కూడా వర్తిస్తుంది. శేషేంద్ర కూడా అక్షరాలా అలాంటి కవే కనుక.

# శేషేంద్ర వాడిన కొన్ని పదాలు, పద-బంధాలు

**క**వులనబడే వారిలో ఉంటారు, మామూలు కవులు కూడా. ఎవరిరచనలు దాదాపు అన్నీ బాగుంటాయో అతడు మహాకవి అని అనదగినవాడు, తదితరులు కవులు.

శేషేంద్ర మహాకవి అని అనదగినవాడు. ఎందుకంటే, అతడు రాసిన దాదాపు అన్ని కవితలు, అన్ని రచనలు బాగున్నాయి కనుక. దీనికి ఆతడొక కొత్త అలంకార భాషనే ఉత్పాదన చేశాడు కనుక ఒక క్రొత్త అలంకార భావాన్ని కూడా. అలా భాషనూ, భావాన్నీ రెండింటిని నవీకరించి కావ్య భాషకు మార్గదర్శకునిలాంటివాడు అయ్యాడు. దీని కొరకు సరిక్రొత్త పదాలను సృష్టించాడు, పదబంధాలను. పాతవాటిని సరిక్రొత్త పంథాలో వాడాడు. అంతేకాదు చిరకాలం నిలవగల ఒక "కావ్య శాస్త్రం" "కవిసేన మేనిఫెస్టో" ద్వారా అందించాడు.

కవికి పదాలు పనిముట్లలాంటివి. చిత్రాకారునికి రంగులు, రేఖలు ఎలాంటివో కవికి అవి అలాంటివి. కవి అతని అవసరాన్ని బట్టి కొన్ని ఇంత వరకే చలామణీలో ఉన్న పదాలను వాడుతాడు, కొన్నిటిని సృష్టిస్తాడు, కొన్నిటిని పదాలకు పదాలు జోడించి, లేక పదాలను పదాల నుండి విడదీసి కొత్త అర్థాలను ఆపాదించి ఉపయోగిస్తాడు. ఎన్నో పదాలకు ఎన్నెన్నో అర్థాలు, అర్థ ఛాయలు, వాటిని వాడే సమయాలూ, సందర్భాలూ, ఔచిత్యాలూ, కళలు, ఉపాయాలు, విధానాలూ ఉంటాయి. వాటి వాటి వాడుకలను బట్టి, పదాలు చిన్నవి, పెద్దవి అనునవి వుంటాయి, వాటిని వాడే ఔచిత్యాలు, సందర్భాలు, సమయాలు, సన్నివేశాలను బట్టి. ఒక్కొక్కసారి ఎంత చిన్న పదమైనా పెద్దదవుతుంది దాని వాడుక యొక్క సమయ సందర్భాన్ని బట్టి, ఒక్కొక్కసారి పెద్దదే చిన్నదవుతుంది. పదాలను రచయితలు విడిగా వాడుతారు, ముడిగా కూడా, వారి వారి ప్రతిభా, ప్రావీణ్యాతా, పాండిత్యాలను బట్టి, వారి వారి ఉపయోగించే ఉత్పాదన చేసే శక్తిని బట్టి.

ఎంత రమణీయమైన, కమనీయమైన పదాలైనా, వాటికవే స్వతహాగా కవితలు కావు. అవి కవితలౌతాయి వాటితో కవి చేసే వాక్యాలవలన, పంక్తుల వలన. పదాల కమనీయత, రమణీయత,

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Na+Sahitya+Vyasalu](http://kinige.com/book/Na+Sahitya+Vyasalu)**

*** * ***